## క్లుప్తంగా

### విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

**గట్టు:** మండలంలోని మాచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు గురువారం ప్లేట్లు పంపిణీ చేశారు. మాచర్ల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రవిప్రకాష్, కృష్ణగౌడు, రేణుక, చంద్రబాబు, రాహుల్‌లు రూ.24 వేల విలువ చేసే 400 ప్లేట్లను విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**మానవపాడు:** జాతీయ రహదారి–44పై మానవపాడు స్టేజీ సమీపంలో బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం వివరాల మేరకు.. బల్గెరకు చెందిన ఉరుకుంద, భార్య ముగ్గురు పిల్లలతో కలిసి మానవపాడు మండలం నుంచి కర్నూల్ వైపు వెళ్తున్నారు. మానవపాడు ఎక్స్ రోడ్డు దాటుతుండగా, హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉరుకుంద, అతని కుమారుడు మనోజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

### మహిళ అదృశ్యం: కేసు నమోదు

**కేటీదొడ్డి:** మతిస్థిమితం సరిగా లేని మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని గువ్వలదిన్నెకు చెందిన అంజనమ్మ (25) ఈ నెల 20 ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. చుట్టు పక్కల బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### నేడు బహిరంగ వేలం

**గద్వాల క్రైం:** వివిధ కేసుల్లో పట్టుబడిన 7 ద్విచక్ర వాహనాలకు శుక్రవారం ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆశాఖ సీఐ గణపతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సమయంలోగా రూ.5వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

### ఎంపఓగా బాధ్యతల స్వీకరణ

**మానవపాడు:** మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారిగా సందీప్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గతంలో ఎంఏఓగా విధులు నిర్వహించిన సుబ్బారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు సందీప్‌కుమార్‌కు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. సుబ్బారెడ్డి అలంపూర్ డివిజన్ కార్యాలయంలో సాంకేతిక వ్యవసాయ అధికారిగా బదిలీ అయ్యారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

### గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

**మానవపాడు:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అమరవాయి, మానవపాడు గ్రామాల గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ యాకూబ్ తెలిపారు. గద్వాల్‌కు రక్త నమూనాలు పంపించినట్లు తెలిపారు. రక్తహీనత రాకుండా న్యూట్రీషన్, ఐరన్‌మాత్రలు, తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌ఎన్ హెలెన్, చంద్రన్న, అక్కమ్మ, తిరుమల్‌రావు, మాబి, దేవమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉండవెల్లిలో 4 సెం.మీ. వర్షపాతం

**ఉండవెల్లి:** మండలంలో 4 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హుస్సేన్ తెలిపారు. దీంతో గ్రామాల్లో పొగాకు నారుకు డిమాండ్ పెరిగింది. మొక్కజొన్న, మిరప పంటలను కూలీలతో సరిచేయిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అధికారులు మరమ్మతు చేస్తున్నారు.

### నిబంధనలు పాటించాలి

**అయిజ:** దూప, దీప, నైవేద్యం ఆలయాలకు సంబంధించిన పూజారులందరూ తప్పకుండా ప్రతిరోజు ఆలయాల్లో పూజలు నిర్వహించాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరి తెలిపారు. గురువారం మండలం కేంద్రంలోని రామప్పస్వామి, గుంత రామలింగేశ్వర, రంగనాథస్వామి ఆలయంతో పాటు శివాలయాన్ని ఆమె సందర్శించారు. కార్యక్రమంలో దూప, దీప, నైవేద్య అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షులు చక్రవర్తి, ఆలయాల అర్చకులు పాల్గొన్నారు.

### రైతుల సమస్యలపై పోస్టర్ల విడుదల

**శాంతినగర్:** రైతుల సమస్యలపై ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించే నిరసన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను రైతాంగ సమితి నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం విడుదల చేశారు. రైతాంగ సమితి రాష్ట్ర కా ర్యదర్శి జి.గోపాల్, గోపాల్‌రెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు హనుమంతు ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27న మండల రెవెన్యూ కార్యాలయాల ఎదుట, 28న కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడతామని, రైతులందరు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ విశ్వనాథరెడ్డి, రాముడు, భాస్కర్, జహంగీర్‌బాషా ఉన్నారు.

# రోడ్లున్నా.. బస్సు రాదాయే

- బస్సులురాక ప్రయాణికుల అవస్థలు
- ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

**ఎర్రవల్లిచౌరస్తా:** రోడ్డు సౌకర్యం ఉన్నా, పల్లెలకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఇటిక్యాల మండలంలో ఎర్రవలి చౌరస్తా నుంచి షేకుపల్లి మీదుగా సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల, పాత గార్లపాడు వరకు బీటీ రోడ్డు సక్రమంగా ఉన్నా బస్సు సర్వీసులు లేక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు కంపెనీ నుంచి మునగాల, ఇటిక్యాల మండల కేంద్రం, ఉదండాపురం, చాగాపురం, షాబాద్, సాతర్ల, వావిలాల వరకు బీటీ రోడ్డు ఉంది. ఆర్టీసీ బస్సు సకాలంలో తిరగకపోవడంతో ప్రయాణికులు నిత్యం అష్టకష్టాలు పడుతూ ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది.

**తిప్పలు పడుతున్న పల్లె ప్రజలు**

ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నె, గోపల్‌దిన్నె, షేకుపల్లి, సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల, గార్లపాడు, వేముల, బట్లదిన్నె, వల్లూరు గ్రామాలకు కొంతకాలంగా ఆర్టీసీ బస్సు సౌ కర్యం లేకపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు తిప్పలు పడుతున్నారు. అంతకు ముందు గద్వాల డిపో నుంచి మూడు రూట్లలో ఉదయం నుంచి రా త్రి వరకు పల్లెల మీదుగా ఆర్టీసీ బస్సులు తిరిగేవి. కరోనా కారణంగా లాక్‌డౌన్ తర్వాత విద్యార్థుల కోసమే ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు తిరిగేది.

**ప్రైవేట్ వాహనాల ఇష్టారాజ్యం..**



బస్సులు రాకపోవడంతో పరిమితికి మించి ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు

నిత్యం మండల కేంద్రంతో పాటు ఎర్రవల్లి చౌరస్తాకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో పరిమితికి మించి ప్రయాణి



బొలెరో వాహనంలో వెళ్తున్న ప్రయాణికులు

కులను ఎక్కించుకొని ప్రమాదాలకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పల్లెలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**బస్సు సౌకర్యం కల్పించాలి..**



ఎర్రవల్లిచౌరస్తా నుంచి షేకుపల్లి మీదుగా కారుపాకులకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. ప్రైవేట్ వాహనాల ను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రయాణికులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యను తీర్చేందుకు పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

– రవికుమార్, కారుపాకుల

**ఉన్నతాధికారులు స్పందించాలి..**



గ్రామాలకు బస్సులు తిరగకపోవడం వల్ల ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. పల్లెలకు బస్సులను నడపాలని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా నేటి వరకు సమస్య పరిష్కారం కాలేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రామాంజనేయులు, సాసనూలు

## అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



అయిజలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**అయిజ:** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణమాఫీ చేయలేదని బీఆర్‌ఎస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి, పెట్రోల్ బంక్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయకుండా కొర్రీలు పెడుతూ రైతులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. ఎలాంటి ఆంక్షలు విధించకుండా అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయకుంటే నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, బీఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మేరమ్మ, ప్రేమలత, పల్లయ్య, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

**రైతులందరికీ రుణమాఫీ చేయాలి**

**గట్టు:** ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల, హనుమంతు నాయుడు డిమాండ్ చేశారు. రైతు రుణ మాఫీపై బీఆర్‌ఎస్ అధిష్టానం పిలుపు మేరకు కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి బల్గెర దగ్గర బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. గట్టు బస్టాండ్ ఆవరణలో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేశారు. బల్గెర మాజీ సర్పంచ్ సామేలు, నాయకులు రామునాయుడు, కిష్టప్ప, వెంకటేష్, గోపాల్, తిమ్మప్పగౌడు, వీరేష్, బొజ్జయ్య, రాజగోపాల్, కృష్ణ, గురు, ఆంజనేయులు, తాయప్ప, తిమ్మప్ప, రాజు పాల్గొన్నారు.

## వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



వర్షాలకు దెబ్బతిన్న పంటలు పరిశీలిస్తున్న ఏఈఓ భక్తవత్సల

**గట్టు:** మండలంలోని బోయలగూడెం శివారులో ఇటీవల భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలను గురువారం వ్యవసాయ విస్తర్ణ అధికారి భక్తవత్సల పరిశీలించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి, మిరప, కంది పంటలు దెబ్బతిన్నట్లు రైతులు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వ్యవసాయ విస్తర్ణ అధికారి బోయలగూడెం క్లస్టర్ పరిధిలో దెబ్బతిన్న పంటలను స్వయంగా పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. భారీ వర్షానికి పత్తి, మిరప బాగా దెబ్బతిన్నాయని, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**అయిజ:** వర్షాకాలం అనేక రకాల వ్యాధులు సంక్రమిస్తాయని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌కేఎస్‌కే హెల్త్ కౌన్సెలర్ రామాంజనేయులు అన్నారు. గురువారం జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి కస్తూర్బాలో విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు వస్తాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు పుష్పమ్మ, కవిత,



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌కేఎస్‌కే హెల్త్ కౌన్సెలర్ రామాంజనేయులు

ఆశ కార్యకర్తలు అలువేలమ్మ, నాగబాల, కేజీబీవీ ఏఎన్‌ఎం చంద్రకళ పాల్గొన్నారు.

## ఫ్యామిలీ సర్టిఫికేట్ ఇవ్వాలని నిరసన

**అలంపూర్‌రూరల్:** మండలంలోని కోనేరు గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు ఫ్యామిలీ సర్టిఫికేట్ ఇవ్వాలంటూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. తాము ఐదుమందిమి అక్కచెల్లెల్లు ఉండగా, వారికి అన్న ఉన్నాడు. చెల్లెళ్లకు తెలియకుండా అన్న నర్సింహ ఫ్యామిలీ సర్టిఫికేట్ తీసుకున్నాడు. అందులో చెల్లెళ్ల పేర్లు లేవు. వీరు రెండు నెలల క్రితం రెండుసార్లు ఫ్యామిలీ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసుకోగా, తహసీల్దార్ ఇవ్వడం లేదని మహిళలు చిట్టెమ్మ, ముద్దమ్మ, శ్యామలమ్మ, దేవమ్మ, సరోజమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చుట్టూ తిరుగుతున్న తమకు న్యాయం చేయడం లేదని, అన్న చేసిన మోసానికి బలయ్యామని తెలిపారు. అధి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు

కారులు ఎంక్వైరీ చేయకుండా ఫ్యామిలీ సర్టిఫికేట్ ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రెవెన్యూ అధికారులను ఎంక్వైరీకి కోనేరు పంపినట్లు తహసీల్దార్ మంజుల తెలిపారు. కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని, పరిశీలించి సర్టిఫికేట్ క్యాన్సిల్ చేసుకోవాలని తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అయిజ:** భారీ వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని వాగులు, వంకలు ఉప్పొంగి పారుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. వాగులు పొంగి పార్లే సమయంలో ప్రజలు నీటి ప్రవాహాన్ని దాటరాదని, తగ్గిన అనంతరం ప్రయాణం చేయాలని అన్నారు. మట్టి మిద్దెలు కూలిపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని, పాత ఇంటిలో నివసించేవారు ఇండ్లను ఖాళీచేయాలని సూచించారు. పంటపొలాల్లో పిడుగుపాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే విజయుడు



**అలంపూర్:** సీఎం సహాయ నిధిని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. రాజోలి మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఉవైస్ ఆపరేషన్ కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో రూ.5లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు తెలిపారు. వారితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

## మొక్కలు కుటుంబంలో భాగమే



**రాజోళి:** మొక్కలు కుటుంబంలో భాగంగా పెంచాలని ఎంపీడీఓ ఖాజా మొయినొద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో 'నాటుదాం ఒక చెట్టు అమ్మపేరు మీద' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలు, పిల్లలు, స్థానికులతో కలిసి మొక్కలు నాటించారు. ప్రతి ఇంటి ముందు, రోడ్లకు ఇరువైపులా, పరిసరాలలో మొక్కలను విరివిగా నాటాలని, నాటిన ప్రతి మొక్కను కాపాడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**మానవపాడు:** మనం నాటే ప్రతి మొక్క భవిష్యత్ తరాల మనుగడ కోసమేనని ఎంపీఓ భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని గంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'నాటుదాం ఒక మొక్క–అమ్మ పేరు మీద' అనే కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో లెక్చరర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**కేటీదొడ్డి:** మండల కేంద్రంలోని పాఠశాలలోని 'నాటుదాం ఒక చెట్టు–అమ్మ పేరు మీద' అనే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ఏపీడీ శ్రీనివాసులు హాజరై మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు ఖాళీ ప్రదేశాల్లో, ఇంటి ముందు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీఓ అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

**శాంతినగర్:** వడ్డేపల్లి మండలంలోని రామాపురం, తిమ్మాజిపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ రామకృష్ణ మొక్కలు నాటారు. 'ఏక్ పేడ్ మా కే నాం' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, ఆశలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాజీ కోఆప్షన్ సభ్యుడికి సన్మానం

**రాజోళి:** జెడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడిగా మండల కేంద్రానికి చెందిన నిషాక్ ఎన్నో సేవలందించారని ఎంపీపీఎస్ పాఠశాల సిబ్బంది తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని కోటవీధి పాఠశాలలో ఆయనను పూలమాల, శాలువాతో సన్మానించారు. పదవీ ఉన్నా లేకపోయినా, ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని మాజీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది సురేష్, గజేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పశువులను తరలించేందుకు పాట్లు

**అయిజ:** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డులో ప్రతి గురువారం వ్యవసాయ మార్కెట్ అధికారులు పశువుల సంతను నిర్వహిస్తున్నారు. వారానికి ఒకసారి నిర్వహించే పశువుల సంతలో క్రయ విక్రయాలు నిర్వహించేందుకు మండలంలోని వివిధ గ్రామాల రైతులు సంతకు ఎద్దులుతో పాటు, గేదెలు, గొర్రెలను వివిధ వాహనాల్లో తరలిస్తుంటారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని ఉత్తనూరు సమీపంలో వాగు ఉధృతంగా పారింది. దీంతో వాగు దాటలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేసేది ఏమీలేక ఎద్దులు, గేదెలు, గొర్రెలు, మేకలను వాహనాల నుంచి కిందికి దింపి రైతులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కు బిక్కుమంటూ వాగును దాటించారు. ఆ ప్రదేశంలో బ్రిడ్జిని నిర్మించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.



ఉత్తనూరు వద్ద వాగు ప్రవాహంలో ఎద్దులను దాటిస్తున్న రైతులు

## సీపీఎస్‌కు వ్యతిరేకంగా బ్లాక్‌డే నిర్వహిద్దాం

**అయిజ:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని వర్తింపజేస్తూ తీసుకొచ్చిన జీఓ నెంబర్ 28ని వ్యతిరేకిస్తూ ఆగస్టు 23న బ్లాక్ డే నిర్వహిద్దామని టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు విష్ణు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బ్యానర్ ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శుక్రవారం ప్రతి ఉద్యోగి భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జి ధరించి నిరసన తెలపాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి రమేష్, గౌరవ అధ్యక్షులు బుచ్చన్న, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాములు, అధ్యాపకులు కృష్ణవర్ధన్, చలపతి రెడ్డి, గాయత్రి, నరేష్ కుమార్ పాల్గొన్నారు.




ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న టీఎస్ సీపీఎస్ ఈయూ నాయకులు

## పండ్లతోటల సాగుపై అవగాహన అవసరం

**మల్దకల్:** పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని డీఆర్డీఓ, అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు అన్నారు. గురువారం మండలంలోని తాటికుంట శివారులో రైతులు సాగుచేసిన పండ్ల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్ల తోటలు సాగుచేసే చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వచ్చే పండ్ల తోటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతులకు పండ్లతోటల సాగు విస్తీర్ణంపై అవగాహన కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. అంతకుముదు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఏపీఓ సుజాత, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, ఇబ్రహీం, విజయలక్ష్మి పాల్గొన్నారు.



తాటికుంటలో పండ్ల తోటలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

## భారీ వర్షానికి కొట్టుకుపోయిన రహదారి

రెండు మండలాల మధ్య నిలిచిన రాకపోకలు

**ధరూరు:** రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మండలంలోని ఆయా గ్రామాల్లో పంట పొలాల్లోకి నీళ్ల చేరాయి. భారీ వరద నీటి వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. మండల పరిధిలోని నీలహళ్లి – కేటీదొడ్డి మండలంలోని పాతపాలెం గ్రామాల మధ్య వాగుకు పెద్ద ఎత్తున వరద నీరు రావడంతో పొంగిపొర్లింది. ఏడాదిన్నర క్రితం ఈ వాగుపై పురాతన బ్రిడ్జిని కూలగొట్టి కొత్త బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఆ పక్కనే తాత్కాలిక మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. భారీ వరద నీటికి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీనిపై కలెక్టర్ స్పందించి సంబంధిత శాఖ అధికారుల ద్వారా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



నీలహళ్లి -పాతపాలెం మధ్య కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

### ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

**మల్దకల్:** త్వరలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లోని ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మల్దకల్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఓటరు జాబితాను వార్డుల వారీగా విభజన చేయాలన్నారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించి, 18ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటరుగా నమోదు చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటిండెంట్ నర్సన్న, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### మండల మహిళా సమైక్య సమావేశం

**గట్టు:** మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు హాజరై ప్రతి నెల ప్రగతి ఎలా పెంచాలని సూచనలు చేశారు. అనంతరం కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీసీలు, తదితరులు ఉన్నారు.

### అభివృద్ధి పనులు చేయండి

**అయిజ:** కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మాని అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. జి ల్లాలను కలిపే ప్రధాన రహదారులు శిథిలమై సంవత్సరాలు గడుస్తు న్నా కొత్త రోడ్లు నిర్మించడం లేదన్నారు. కా ర్యక్రమంలో బీజేపీ నా యకులు భీమసేన్ రావు, భగత్ రెడ్డి, లక్ష్మ ణ్ గౌడ్, లక్ష్మణాచారి, వెంకటేష్ పాల్గొన్నారు.

### ఉద్యోగుల సేవలు చిరకాలం గుర్తుంటాయి

**ఎర్రవల్లి:** ఉద్యోగులు తమ వృత్తిలో ప్రజలకు చేసిన సేవలు చిరకాలం నిలిచిపోతాయని డీఏఓ గోవింద్ నాయక్ అన్నారు. గురువారం ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురం రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి అయ్యూబ్‌కు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఏఓ గోవింద్ నాయక్, ఏడీఏ సక్రియ నాయక్‌లు డీలర్లతో కలిసి ఏఓకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

### చెరువులను తలపిస్తున్న కస్తూర్బా విద్యాలయం



**మల్దకల్:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణాలు బుధవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువులను తలపిస్తున్నాయి. వర్షం నీటితో పాటు గ్రామ సమీపంలోని దేవర చెరువు అలుగుపారింది. కస్తూర్బా, పోలీస్‌స్టేషన్ ముందు, ఎస్సీ వసతిగృహం సమీపంలో ఉన్న కల్వర్టులకు కంపచెట్లు, చెత్తాచెదారం అ డ్డుపడడంతో పాఠశాల ఆవరణలో నీరు నిలిచింది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు జేసీబీతో చెత్తను తొలగించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకున్నారు.